**పక్క ఇంటి** కోటేశ్వరరావుగారి కోడలు అదృష్టానికి అసూయపడుతూ ఉంటుంది జానకి.

పేరుకు తగ్గట్టు కోటేశ్వరరావుగారిని వరించింది లక్ష్మి. ఆయనకు ఇద్దరబ్బాయిలు మాత్రమే ఉన్నారు. వారిలో పెద్దబ్బాయికి వివాహమయింది. అతను తండ్రి వ్యవహారాలు చూసుకుంటూ ఉంటాడు. చిన్నబ్బాయి వైద్య కళాశాలలో చదువుతున్నాడు. కోటేశ్వరరావుగారి భార్య మహాలక్ష్మి నిజంగా మహలక్ష్మే అనిపించుకుంది బ్రతికినన్నాళ్ళు. కోడలు రాక ముందే హృద్రోగంవల్ల హఠాత్తుగా మరణించింది మహలక్ష్మమ్మ.

కోడలు కామేశ్వరికి పాతిక సంవత్సరాలలోపు వయస్సు. ఇద్దరు మగపిల్లలు పుట్టారు. పుట్టింట ఆమె ఒక్కగానొక్క కూతురు. వారు భోగభాగ్యాల్లో కోటేశ్వరరావుగారికి తీసిపోరు. "అటు పుట్టినింట, ఇటు మెట్టినింట లక్ష్మి తాండవిస్తూంటే ఆవిడకేం! మహారాణి" అని చూసినవాళ్ళు అసూయ చెందడంలో ఆశ్చర్యం ఏముంది?

జానకి కోటేశ్వరరావుగారి మేడపక్క పెంకుటింట్లో కాపురం ఉంటున్న మధ్య తరగతి మాధవరావు భార్య. అతనికి వచ్చే రెండు వందలు ముగ్గురు పిల్లలుగల వారికి చాలవు మరి. మాధవరావుకు ఉన్న ఆస్తి పెంకుటిల్లు మాత్రమే.

జానకి కామేశ్వరి అదృష్టం సంగతి భర్త దగ్గిర పొగుడుతూ ఉంటుంది. తనదురదృష్టాన్ని తిట్టుకుంటూ



**అదృష్ట వంతులను చూచి ఈర్ష్యకు లోనుకానివారు సాధారణంగా కవిపించరు. ఇంతకూ ఈ అదృష్టం ఏమిటో, ఎలా ఉంటుంటో ఎవరూ చెప్పనూలేరు. దుర దృష్టంగా పరిగణించేది కూడా ఒకప్పుడు అదృష్టమే అవుతుంది మరి!**

---

ఇదంతా మాధవరావు అసమర్థతేఅనివాపోతూ ఉంటుంది.

మాధవరావు అన్నీ విని ఒక చిరునవ్వు విసురుతాడు. జానకికి ఒళ్ళు మండిపోతుంది. "మీకు ఇకిలించడం ఒక్కటే వచ్చు, భార్య ముద్దు ముచ్చటలు తీర్చలేక పోయినా" అంటూ సాగదీస్తుంది.

"జానీ! కామేశ్వరి అదృష్టం నీకు కావాలా? నువ్వు ఎప్పుడైనా ఆమెను ఆ మాట అను. ఏమంటుందో?" అన్నాడు.

"ఏమంటుంది? ఉన్నది చాలదంటుంది. మొన్న తన నగలు చూపించమంటే చూపించింది. ఇనపపెట్టె నిండా నగా నట్రా ఉంటున్నాయి. రవ్వలు, కెంపులు,ముత్యాలు, పచ్చలు పొదిగిన వడ్డాణం చూస్తే కళ్ళు చెదిరిపోతు న్నాయి. అదీగాక మువ్వల వడ్డాణం, చెక్కుడు వడ్డాణం మొత్తం మూడు వడ్డాణాలు ఉన్నాయి. అత్తవారు రవ్వల వడ్డాణం పెట్టారట. అమ్మగారు మువ్వల వడ్డాణం. భర్తకు అవి నచ్చక చెక్కుడు వడ్డాణం వేయించాడట. మెడలో చెప్పనలవికాదు, నెక్లేసులు, హారాలు అబ్బ! కళ్ళు తిరిగిపోతాయి అవి చూస్తేను. దేశంలో బంగారం అంతా ఇక్కడే ఉందా? అన్నంత భ్రమ కలిగిస్తాయి. పెట్టి పుట్టాలి దేనికైనా. నేనూ ఉన్నాను. ఎందుకు? మెళ్ళో నల్లపూసలు తప్ప చిన్న పెత్తు బంగారం లేదు." నిట్టూర్చింది జానకి.

"ఆమె అవి పెట్టుకోవటం నువ్వు చూశావా?"

"పండుగైనా, పబ్బమైనా ఏదీ వేసుకోదు. బీరువానిండా పట్టు చీరలు ఉన్నాయి; కట్టుకోదు. ఏ ప్రింటింగ్ చీరలో కట్టుకుంటుంది. 'ఏం వదినా, కట్టుకోవు?' అంటే —'ఏద్దైతేనేం వదినా' అంటుంది. ఉన్నవారికి అనుభవించటం కష్టం లాగుంది." మూతి తిప్పుకుంటూ అంది.

"ఔను. ఎవరి బాధ ఎవరికి అర్థమౌతుంది? నీకున్న అదృష్టం ఆవిడికి లేదు. ఆవిడికి ఉన్న అదృష్టం నీకు లేదు" అన్నాడు మాధవరావు ఆలోచిస్తూ.

"నాకున్న అదృష్టం ఏమిటీ? పెంకుటిల్లు, పసుపుతాడేనా? చాలీచాలని జీతం. శుభ్రమైన చీర ఒకటైనా ఉందా? ఇదేగా నా అదృష్టం? ముదనష్టం" అంది తీవ్రంగా.

"పోనీ కామేశ్వరినే అడుగు. నా నోటితో చెప్పినా నీకు నమ్మకం ఉండదు" అన్నాడు మాధవరావు.

"అంత నాకున్న అదృష్టము, ఆవిడికి లేనిది ఏమి ఉందో నేనూ అడుగుతాను" అంది విసురుగా జానకి.

**2**

పండుగనాడు తనకున్న కాశ్మీర్ చీర ఇస్త్రీచేసినది కట్టుకుని పొంగలి గిన్నెలో పెట్టుకుని కామేశ్వరి ఇంటికి వెళ్ళింది జానకి.

అప్పుడే పూజ ముగించుకుని వచ్చిన కామేశ్వరి జానకిని ఎంతో ఆప్యాయంగా పిలిచి కూర్చోబెట్టింది.

మెళ్ళో సూత్రాలతాడు, నల్లపూసలు, చేతులకు నాలుగేసి బంగారు గాజులు, ఫుల్ వాయిల్ ఇస్త్రీ చీరలు—ఇదీ కామేశ్వరి పండుగ ముస్తాబు.

ఆ వేషం చూసేసరికి జానకికి ఆశ్చర్యంవేసింది. తన మనస్సులో మాట అడగటానికి అది మంచి అదనుగా భావించింది.

"ఏమిటి, వదినా, మాట్లాడవు? మీ భోజనాలు అయిపోయాయా? అన్నయ్యగారు ఇంట్లో లేరా?" అంది కామేశ్వరి.

"అన్నయ్యగారు లేకేం? నా పూజ ఇప్పుడే అయింది. నీకు పొంగలి ఇచ్చి వెళదామని వచ్చాను. అది సరేకాని, వదినా, నేనొక మాట అడుగుతాను. కోపగించుకోవుకదా?" అంది జానకి.

"నాకేం కోపం, వదినా! ఏమిటో అడుగు" అంది కామేశ్వరి.

"మరేంలేదు. ఇన్ని నగలున్నా, ఇన్ని చీరలున్నా పండుగనాడు కూడా నీవు ఇలా ఉంటే నాకేం బాగా లేదు, వదినా" అంది జానకి.

కామేశ్వరి పేలవంగా నవ్వింది. 'ఇంతేనా నీ సందేహం' అన్నట్టు ఉంది ఆమె చూపు.

"ఏమమ్మా వదినా! లేని వాళ్ళం లేక ఏడిస్తే నువ్వు ఉన్నదానివి కట్టుకోవేం?" అంది జానకి నిగ్గదీసి.

"వదినా! నీవు నగలు పెట్టుకోకపోయినా, ఖరీదైన చీరలు కట్టుకోకపోయినా చాలా అదృష్టవంతురాలి వమ్మా. నా లాంటి అదృష్టం ఏ స్త్రీ కోరుకోదు. పైకి డాబు, దర్పం అంతే" అంది కామేశ్వరి.

ఈ సారి కామేశ్వరి దైన్యస్థితి జానకికి జాలి కలి గించింది. ఆమెపై అసూయ అంతరించిపోయింది. దానిస్థానే సానుభూతి ఏర్పడింది. ఓదార్పు మనస్సుతో అంది జానకి:

"నీకు అభ్యంతరం లేకపోతే నీ బాధ ఏమిటో నాకు చెప్పు, వదినా. నేను తీర్చలేకపోయినా సానుభూతి చూపించగలను."

"ఏం చెప్పను, వదినా! భగవంతుడు ప్రతి మనిషికీ ఏదో ఓ చింత ఉంచుతాడు. లేకపోతే ఈ మానవులు తన ఉనికిని మరిచిపోతారని భయమేమో? నేనూ నీ స్థితిలో ఉంటే ధనమే ప్రధానం అనుకుని బాధపడే దాన్నేమో? కాని, నాకు కావలసిన దానికన్నా ఎక్కువే ఇచ్చాడు ఆస్తి. అయితేనేం? ధనం మనిషిని పెడ దోవలో పెడుతుందోమో? అందరి మాటా నాకు తెలియదు. మీ అన్నయ్య గారి విషయంలో అక్షరాలా అంతేసుమా! ఆయనకు లేని వ్యసనాలంటూ లేవు. ఒక్కరోజన్నా నవ్వుతూ నాతో గడపలేదు. ఎప్పుడూ హడావిడే. ఏమంటే వ్యాపారం చూసుకోవద్దూ అంటారు. అదైనా కోపంగానే. పండుగనాడైనా పిల్ల లతో, నాతో కలిసి భోజనానికి ఉన్నారేమో చూడు. నగలు, చీరలు, ధనం నాపైన వేసుకుని తగలపెట్టు కోనా? ఆయన నాతో మాట్లాడి రెండు నెలలు గడి చాయి. ఎప్పుడూ తొందరలోనే ఉంటారు. ఎప్పుడూ వ్యాపారమో అంటూ ఉంటారు. నెలకు ఇరవైరోజులు



అలసిన కన్నులు

చిత్రం — బి. ఎస్ (టేకిసెట్టిపాలెం)

---

నెల్లూరి వేదవతీదేవి







# నాకీ అదృష్టం చాలు

హైదరాబాదులోనే ఉంటాలు. అంతా ఓజినెస్ అనుకుంటారు. అది కొంతవరకు నిజమే అయినా ఈయనకు కావలసిన మత్తు పదార్థాలు అక్కడ దొరుకుతాయి. రేసులు, పేకాటలు, ఒకటేమిటి? గోపాలకృష్ణ పేరుపెట్టినందుకు గోపికలతో విహరిస్తూ కాలక్షేపంచేసే మీ అన్నయ్య నా ఉనికి మరిచిపోయిన ఆశ్చర్యం ఏముంది? చెప్పు, జానకీ! ఇప్పుడు చెప్పు పుట్టింటా మెట్టినింటా ధనరాసులు మూలుగుతున్న నాఈఅదృష్టం గొప్పదా? చిలకా గోరింకల్లా ఉన్న మీ అదృష్టం గొప్పదా? తెచ్చుకున్న జీతంలో ముచ్చటగా పిల్లలుమీరు ఉన్నంత తిని సంతోషంగా అన్యోన్యంగా ఉంటారు. నీ అదృష్టం గొప్పదికాదా? చెప్పు, జానకీ? ఒక్క అనురాగపు మాటకు నోచుకోని నాదీ ఒక అదృష్టమేనా? ధనంవల్ల నాకు ఒరిగినదేమిటి? ఒక్కొక్క సారి బ్రతుకే భారంగా ఉంటుంది. చావాలని అనుకుంటాను. కాని, ఈపసివాళ్ళకు దిక్కు? ఈమమతే నన్ను బ్రతికిస్తోంది. నిన్ను చూసి నేననుకుంటాను- జానకికి ధనం లేకపోయినా కాటికీ గుడ్డకూ లోటు లేదు. [illegible]. ఆఫీసు టైములో తప్ప మిగిలిన కాలమంతా నిన్ను ఒక్క క్షణం వదలరు మాధవరావు అన్నయ్య. నిజంగా నీది ఎంత అదృష్టం! ఈ ధనం అంతా వెచ్చించినా నీ అదృష్టం నాకు వస్తుందా, జానకీ? ఇంక నగలు, చీరలు ధరించాలనే కోరిక నాకేం ఉంటుంది? తెచ్చిపడవెయ్యగానే సరా? ఎవరికోసం సింగారించుకోను? ఏది కట్టుకున్నా గడిచిపోతాయి రోజులు, ఏమంటావు?' కామేశ్వరి చెక్కిళ్లపై కన్నీరు కాలవలయింది.

జానకి హృదయం ద్రవించిపోయింది. కామేశ్వరిని ఓదార్చి ఇంటికి వచ్చింది. మాధవరావు ఇంట్లో లేడు. "నాన్న ఎక్కడున్నారురా?" పెద్ద పిల్లాణ్ణి అడిగింది.

"ఎవరో వస్తే ఇప్పుడే వస్తానని బయటికి వెళ్లారమ్మా" అన్నాడు.

జానకికి మాధవరావు మంచితనం, ప్రేమ, ఒరిమి అన్నీ ఇప్పుడు అవగాహన అవుతున్నాయి. 'నిజంగా కామేశ్వరి అదృష్టం ఏం చేసుకోను? నాదే అదృష్టం' అనుకుంటూ పిల్లలకు భోజనాలు పెట్టి మాధవరావు కోసం ఎదురుచూస్తోంది.

## 3

"ఎక్కడికి వెళ్లారు?" ఆత్రంగా అడిగింది జానకి.

"కృష్ణమూర్తి బజారుకు వెళ్తున్నాంటే వెళ్లాను. రెండు పదులు అప్పు ఇచ్చాడు. నీకు పండుగకు చీర జాకెట్ గుడ్డా కొన్నాను" అంటూ చేతికి ఇచ్చాడు. జానకి మనస్సు ద్రవించింది. క్రిందటి రోజు పండుగకు చీర కొనలేదని తను ఎంత వేధించినదీ గుర్తుకు వచ్చి దుఃఖం పొంచుకువచ్చింది. ఆమె చెక్కిళ్ల వెంట రెండుకన్నీటి ముత్యాలు దొర్లాయి.

"ఏడుస్తున్నావా, జానకీ!" అన్నాడు అర్థంకాని మాధవరావు.

"లేదు. ఇవి ఆనందబాష్పాలు. నాకీ అదృష్టం చాలు" అంటూ అతని హృదయంలో తలదాచుకుంది జానకి.

★